

చిన్నారిని చిదిమేశాడు!



- పదకొండేళ్ల బాలికపై యువకుడి అత్యాచారం..ఆపై హత్య?
- గిరిజనగ్రామంలో ఘోరం

- వార్త మెయిన్ 3 పేజీలో..

వైసీపీలో లుకలుకలు

పాడేరు, అరకులోయ అసెంబ్లీ ఇన్‌చార్జుల నియామకంపై పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి



గొడ్డేటి మాధవి, అరకు అసెంబ్లీ ఇన్‌చార్జి



మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పాడేరు అసెంబ్లీ ఇన్‌చార్జి

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

ఇన్నాళ్లూ మన్యంలో తమకు ఎదురులేదనే ధోరణిలో వున్న వైసీపీకి తాజాగా జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తల నియామకం తరువాత పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. అధిష్ఠానం నిర్ణయాన్ని సైతం బహిరంగంగానే ఎదురించే పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు నివురుగప్పిన నిప్పులా వున్న వైసీపీలోని వర్గ పోరుకు తాజా పరిస్థితులు ఆజ్యం పోశాయి. దీంతో మన్యం వైసీపీలో ప్రస్తుతం అగ్గి రగులుతున్నది.

- బహిరంగంగానే అధిష్ఠానం వైఖరిని తప్పుబడుతున్న క్యాడర్
- అరకులోయలో మాధవి నియామకంపై కొనసాగుతున్న ఆందోళనలు
- పాడేరు స్థానానికి రెబల్‌గా బరిలోకి దిగుతామని పలువురి హెచ్చరికలు
- తాజా పరిణామాలతో పార్టీ అధిష్ఠానం ఉక్కిరిబిక్కిరి

ఏజెన్సీలో వార్డు సభ్యుడు మొదలుకుని పార్లమెంట్ సభ్యుడు వరకు వైసీపీకి చెందిన వారే ఉండడంతో తామేం చేసినా పర్వాలేదనే ధోరణితో అధిష్ఠానం స్థానికుల అభిప్రాయాలకు విరుద్ధంగా పాడేరు, అరకులోయ ఎమ్మెల్యే స్థానాలకు సమన్వయకర్తలను నియమించడంతో వైసీపీ శ్రేణులు రగిలిపోతున్నారు. నిత్యం ఏదో చోట నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు.

అరకులోయలో తీవ్ర వ్యతిరేకత

ప్రధానంగా అరకులోయ అసెంబ్లీ స్థానానికి సిట్టింగ్ ఎంపీ గొడ్డేటి మాధవిని సమన్వయకర్తగా నియమించడంపై ఆ ప్రాంత వైసీపీ నేతలు, కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆమె అరకులోయ ఎంపీ అయినప్పటికీ, ఆ ప్రాంతంలో పర్యటించకపోవడం, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన నేతలతో కనీస సఖ్యత లేదని తెలిసింది. అలాగే పేరుకే అరకులోయ ఎంపీ అయినప్పటికీ ఈ ప్రాంతం అభివృద్ధి, సంక్షేమానికి ఆమె కనీసం కృషి చేయలేదని స్థానిక నాయకులు అంటున్నారు. కేవలం కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మాత్రమే రావడం తప్ప ఎంపీగా తన పరిధిలోని పార్టీ క్యాడర్, ప్రజల కష్టసుఖాలపై ఆమె దృష్టి పెట్టిన దాఖలాలు లేవని విమర్శిస్తున్నారు. ఈ తరుణంలో అనుకోని విధంగా ఆమెను అరకులోయ అసెంబ్లీ స్థానానికి సమన్వయకర్తగా నియమించడంతో ఇన్నాళ్లూ నివురుగప్పిన నిప్పులా వున్న వైసీపీ శ్రేణుల్లోని అసంతృప్తి ఇప్పుడు బయటకు వస్తున్నది. దీంతో నియోజకవర్గ ఆరు మండలాల్లోని ప్రతి ప్రాంతంలో గొడ్డేటి మాధవికి వ్యతిరేకంగా వైసీపీ నేతలు, కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. మాధవిని కాకుండా నియోజకవర్గం పరిధిలో ఆరు మండలాలకు చెందిన ఎవర్ని సమన్వయకర్తగా నియమించినా వైసీపీ గెలుపునకు కృషి చేస్తామని బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. గొడ్డేటి మాధవిని బరిలో దింపితే అందరం ఐక్యంగా ఓడిస్తామని వైసీపీ నేతలు హెచ్చరిస్తూ ఆందోళనలను కొనసాగిస్తున్నారు.




పెదబయలు : గోమంగి గ్రామంలో వైఎస్సార్ విగ్రహం వద్ద మాధవికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న దృశ్యం

పాడేరు అసెంబ్లీ స్థానానికి రెబల్స్ బెడద

ప్రస్తుతం ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా వున్న మత్స్యరాస విశ్వేశ్వరరాజును స్థానిక అసెంబ్లీ నియోజకవర్గానికి సమన్వయకర్తగా నియమించడంపైనా వైసీపీలో అసంతృప్తి జ్వాలలు రగులుతున్నాయి. దీంతో ఆయనకు రెబల్‌గా బరిలోకి దిగుతామని పలువురు ఆశావహులు బహిరంగంగానే అంటున్నారు. పాడేరు అసెంబ్లీ స్థానంపై సిట్టింగ్ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మితో పాటు సిట్టింగ్ ఎంపీ గొడ్డేటి మాధవి, ట్రైకార్ ఛైర్మన్ సతక బుల్లిబాబు, జి.మాడుగుల జడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి ఆశపడ్డారు. సిట్టింగ్ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని అరకులోయ ఎంపీ స్థానానికి ఎంపిక చేయగా, ఎస్టీ కమిషన్ సభ్యుడైన విశ్వేశ్వరరాజును పాడేరు అసెంబ్లీ స్థానానికి ఎంపిక చేశారు. దీనిపై ట్రైకార్ ఛైర్మన్ బుల్లిబాబు, జి.మాడుగుల జడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి అసంతృప్తితో వున్నారు. ఈ తరుణంలో గురువారం ట్రైకార్ ఛైర్మన్ బుల్లిబాబు, తన మద్దతుదారులతో పాడేరులో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వైసీపీ పెట్టిన తొలినాళ్ల నుంచి పార్టీని నమ్ముకుని వున్న తనకు పాడేరు అసెంబ్లీ స్థానాన్ని కేటాయించకపోవడంపై బాధపడుతున్నానని ప్రకటించారు. అదే క్రమంలో బుల్లిబాబును రెబల్‌గా బరిలోకి దింపుతామని ఆయన అనుచరులు పేర్కొన్నారు. సమన్వయకర్త నియామకంపై పార్టీ పునరాలోచన చేయకుంటే, బుల్లిబాబును స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి దింపుతామని ఆయన అనుచరులు అంటున్నారు. కాగా వైసీపీ చింతపల్లి మండల అధ్యక్షుడు రవి తాను పాడేరు ఎమ్మెల్యే స్థానానికి రెబల్‌గా పోటీ చేస్తానని మీడియా సమక్షంలోనే ప్రకటించారు. దీంతో పాడేరు ఎమ్మెల్యే స్థానానికి వైసీపీ నుంచే కనీసం ఇద్దరు రెబల్ అభ్యర్థులు పోటీలో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో ప్రస్తుతం ఏం చేయాలో అర్థంకాక వైసీపీ అధిష్ఠానం తల పట్టుకుంటున్నది. ఈ పరిస్థితులను గమనిస్తున్న మన్యం వాసులు వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించేందుకు విపక్షాలు పెద్దగా కష్టపడాల్సిన అవసరం ఉండదేమోనని భావిస్తున్నారు.

అరకులోయ బొంపి రోడ్డులో దట్టంగా కురుస్తున్న మంచు



మన్యం గజగజ

దిగజారుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

- పెరిగిన చలి తీవ్రత
- అరకులోయలో 4.6, జీకేవీధిలో 5.5, జి.మాడుగులలో 5.6 డిగ్రీలు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో చలి తీవ్రత అధికంపై మన్యం వాసులు గజగజ వణుకుతున్నారు. అరకులోయలో 4.6, జీకేవీధిలో 5.5, జి.మాడుగులలో 5.6, పెదబయలులో 7.5, చింతపల్లిలో 8, పాడేరులో 8.3 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు శనివారం నమోదయ్యాయి. అండమాన్ నికోబార్ దీవుల్లో అల్పపీడన ప్రభావంతో గత ఐదు రోజులుగా ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగి, చలిప్రభావం కాస్త తగ్గింది. కానీ శనివారం ఉదయం నుంచి పరిస్థితి పూర్తి భిన్నంగా మారిపోయింది. ఉదయం పదిన్నర గంటల వరకు ఏజెన్సీ ప్రాంతంలో దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో పాటు చలి ప్రభావం సైతం అధికంగానే ఉంది. దీంతో ఏజెన్సీ వాసులు వణుకుతున్నారు. దట్టంగా పొగ మంచు కమ్ముకోవడంతో రోడ్డు మార్గం సరిగా కనిపించక హెడ్ లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మధ్యాహ్నం వేళలో ఒక మోస్తరుగా మాత్రమే ఎండ కాస్తున్నది. సాయంత్రం మూడు గంటల నుంచే చలి ప్రభావం చూపుతున్నది. దీంతో ఏజెన్సీ వాసులు మంటలు కాగుతూ, ఉన్ని దుస్తులు ధరిస్తూ చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు.



లంబసింగిలో కురుస్తున్న మంచు

చింతపల్లిలో..

చింతపల్లి: మండలంలో చలి తీవ్రత కొనసాగుతోంది. శనివారం చింతపల్లిలో 8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. మరో పది రోజుల పాటు గిరిజన ప్రాంతంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఏడీఆర్ తెలిపారు. సాధారణంగా డిసెంబరు, జనవరి మాసాల్లో చింతపల్లి, లంబసింగి, జి.మాడుగుల ప్రాంతాల్లో ఒకటి, సున్న, మైనస్ డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. ఈ సీజన్‌లో గత నెల 21న చింతపల్లిలో 7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, ఆంధ్ర కశ్మీర్‌గా పేరొందిన లంబసింగిలో చింతపల్లి కంటే రెండు డిగ్రీలు తక్కువగా నమోదైందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం మరోసారి కనిష్ఠ ఉష్ణోగ్రతలు పది కంటే తక్కువగా నమోదవుతున్నాయి. లంబసింగిలో మధ్యాహ్నం ఒంటిగంట సమయంలోనూ చల్లగాలులు వీస్తున్నాయి. దీంతో లంబసింగి పరిసర ప్రాంత ప్రజలు అధిక సమయంలో ఉన్నిదుస్తులను ధరించి కనిపిస్తున్నారు. చలి మంటలు సైతం 24 గంటలు వీధుల్లో మండుతున్నాయి. చలితో పాటు ... మిగతా 8వ పేజీలో



పడమటి సంధ్యారాగం

మండలంలో గల సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు సమీపంలో మత్స్యగెడ్డ ప్రాంతంలో శనివారం సాయం సంధ్య వేళ సూర్యాస్తమయం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. ఎత్తైన గిరుల మధ్య నుంచి మాయమవుతున్న సూర్యుడు, ఆ సమయంలో మత్స్యగెడ్డపై పడిన సూర్యకిరణాల ప్రతిబింబం అందర్నీ ఆకట్టుకుంది. - ముంచంగిపుట్టు

కుమ్మరిపుట్టు సమీపంలో సాయంత్రం వేళలో ఆవిష్కృతమైన దృశ్యం

చెరువులవేనంలో పర్యాటకుల సందడి



పర్యాటకుల తాకిడి

ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి పర్యాటకుల తాకిడి బాగా పెరిగింది. లంబసింగిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడం, మంచు సోయగాలు పర్యాటకులను ఆకర్షిస్తుండడంతో పొరుగు రాష్ట్రాల పర్యాటకులు సైతం లంబసింగికి క్యూ కడుతున్నారు. శనివారం లంబసింగికి వేల సంఖ్యలో పర్యాటకులు తరలి వచ్చారు. దీంతో ఉదయం నుంచి లంబసింగి, చెరువులవేనం, తాజంగి పర్యాటక ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడాయి. - చింతపల్లి

రాజ్‌మాకు రికార్డు స్థాయి ధర

గతేడాది కిలో రూ. 65

- ప్రస్తుతం కిలో రూ.150
- మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో దిగుబడి లేకపోవడమే కారణం



రాజ్‌మా గింజలు

పాడేరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మన్యంలో రాజ్‌మాకు ఈ ఏడాది రికార్డు స్థాయి ధర లభించింది. హుకుంపేటలో శనివారం జరిగిన వారపు సంతలో కిలో రూ.150 చొప్పున గిరిజన రైతుల వద్ద వర్తకులు కొనుగోలు చేశారు. గత ఐదేళ్లు కిలో రూ.55 నుంచి రూ.65 ధరకు మాత్రమే ఉండే రాజ్‌మా గత వారం రూ.85 వరకు పెరిగింది. మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో ఏజెన్సీలో రాజ్‌మా పంట దెబ్బతింది. దీంతో పంట దిగుబడి ఘోరంగా తగ్గింది. అందువల్లే ఊహించని విధంగా రాజ్‌మాకు మంచి ధర లభించిందని రైతులు, వర్తకులు తెలిపారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాదికి ఈ ధర నిలకడగా ఉండడం లేదా కాస్త పెరగడం తప్ప తగ్గే అవకాశాలు కనిపించడం లేదని వర్తకులు అంటున్నారు. రాజ్‌మా ధర ఆశాజనకంగా ఉండడంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆది నుంచీ అవమానాలే

ఏయూలో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కె.సమతకు దక్కని కనీస గౌరవం

- ఉద్దేశపూర్వకంగా కొంతమంది నిర్లక్ష్యం
- చార్జ్ తీసుకునేందుకు ఛాంబర్‌కు వెళ్లకుండా అడ్డగింత
- మూడు రోజుల వరకూ వాహనం కూడా ఇవ్వని వైనం
- వైస్ చాన్సలర్‌కు చెప్పకుండానే కీలక నిర్ణయాలు
- యూనిఫెస్ట్ నిర్వహణకు సంబంధించిన సమాచారం నిల్
- వాట్సాప్‌లో ఆహ్వానం
- కార్యక్రమానికి ఆహ్వానించే పద్ధతి ఇదేనా?... అంటూ ప్రశ్నించిన ఇన్‌చార్జి వీసీ
- నోరు తెరిస్తే వర్సిటీ పరువు బజారున పడుతుందని బాధను దిగమింగుకుంటున్నారంటున్న సన్నిహితులు



ప్రొఫెసర్ కె.సమత



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.సమతకు క్యాంపస్‌లో కొందరు కనీస గౌరవం ఇవ్వడం లేదు. ఏ విషయం ఆమె దృష్టికి తీసుకువెళ్లడం లేదు. ప్రస్తుతం వర్సిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న యూత్ ఫెస్టివల్‌కు సంబంధించిన సమా చారం కూడా ఆమె అడిగేంత వరకూ చెప్పలేదు. ప్రారంభోత్సవానికి ఆహ్వానం కూడా కేవలం వాట్సాప్‌లో పంపి ఊరుకున్నారు. ఈ పరిణామాలపై ఆమె మనస్తాపంతో ఉన్నట్టు సన్నిహితులు చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితిని తాను మున్నెన్నడూ చూడలేదని, వర్సిటీ పరువు పోతుందనే ఉద్దేశంతోనే సైలెంట్‌గా ఉంటున్నానని ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది.

ప్రొఫెసర్ కె.సమత నవంబరు నెలాఖరులో ఏయూ ఇన్‌చార్జి వీసీగా నియమితులయ్యారు. సీనియర్ ప్రొఫెసర్ అయిన ఆమె అప్పటికి రెక్టార్‌గా ఉన్నారు. వర్సిటీలో సుదీర్ఘ అనుభవం కలిగిన ఆమె పట్ల అధికారులు, అధ్యాపకులు గౌరవ భావంతో వ్యవహరించాలి. కానీ, మాజీ వీసీకి సన్నిహితంగా మెలిగిన కొందరు ఆమెను కనీసం వీసీగా గుర్తించేందుకు అంగీకరించలేదు. చార్జ్ తీసుకునేందుకు వైస్ చాన్సలర్ ... మిగతా 8వ పేజీలో

మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఎస్టీ కాదు

- ప్రభుత్వం ఉత్తర్వులు



కొత్తపల్లి గీత

పాడేరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఎస్టీ కాదని గిరిజన సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె ఎస్టీ, వాల్మీకి కులానికి చెందిన వారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ 2016లో ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని ఏపీ ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి అప్పీల్ చేశారు. ఆ మేరకు గిరిజన సంక్షేమ శాఖ స్పందించింది. 2016లో ఆమెపై జరిగిన కుల విచారణ నివేదిక ఆధారంగా అప్పటి తూర్పుగోదావరి జిల్లా కలెక్టరు సదరు కొత్తపల్లి గీత ఎస్టీ (వాల్మీకి) కులస్థురాలేనని నిర్ధారిస్తూ ఉత్తర్వులను ఇచ్చారు. దీనిపై ఏపీ ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఇ. అంజనేయులు, ఆర్.మహేశ్వరరావు సదరు కలెక్టరు ఉత్తర్వులను ఆక్షేపిస్తూ ప్రభుత్వం వద్ద 2016లోనే అప్పీలు దాఖలు చేశారు. ఈ అప్పీలుపై తెలుగుదేశం ప్రభుత్వంలోనూ, వైసీపీ ప్రభుత్వంలోనూ మొత్తం నలుగురు మంత్రులు విచారణ జరిపారు. ఇటీవల కాలంలో ఈ అప్పీలుపై జరుగుతున్న విచారణ తీరుపై కొత్తపల్లి గీత రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. 2023 ఏప్రిల్‌లో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేస్తూ నాలుగు నెలల్లో ఈ అప్పీలును ముగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ అప్పీలు కేసుపై ప్రస్తుత గిరిజన సంక్షేమ మంత్రి పి.రాజన్నదొర విచారణ చేపట్టారు. అనంతరం ప్రభుత్వం గురువారం గిరిజన సంక్షేమ (కుల విచారణ) విభాగం ద్వారా జీవో ఎమ్ఎస్.నెం.2ను జారీ చేస్తూ 2016లో కొత్తపల్లి గీతను ఎస్టీగా నిర్ధారిస్తూ అప్పటి కలెక్టరు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ ఆమె ఎస్టీ కాదని ప్రభుత్వం పేర్కొంది.

కేజీబీవీ టీచర్ల తొలగింపు

- అనకాపల్లి జిల్లాలో 14 మంది...
- అల్లూరి జిల్లాలో 125 మంది...
- నేడు కొత్తవారికి నియామక పత్రాలు
- సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారుల తీరుపై ఉద్యోగుల ఆగ్రహం

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలోని కేజీబీవీల్లో పనిచేసే 14 మంది టీచర్లను తొలగిస్తూ శనివారం సమగ్ర శిక్ష అభియాన్ కార్యాలయం అధికారులు ఆదేశాలు ఇచ్చారు. వీరి స్థానంలో ఆదివారం కొత్తవారిని నియమించి, సోమవారం విధుల్లో చేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో కేజీబీవీ టీచర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు మొత్తం 125 మందిని తొలగించారు. దీనిపై ఉద్యోగులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేలా అధికారులు చూడాలి తప్ప.. బెదిరింపులకు పాల్పడడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. శుక్రవారం విజయవాడలో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయ ముట్టడి సందర్భంగా ఉద్యోగుల తొలగింపు, షోకాజ్ నోటీస్ జారీ వంటివి ఉండబోవని జేఏసీ నాయకులకు ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. అయితే అందుకు భిన్నంగా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పలువురు అధికారులు వ్యవహరించడంపై ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇందుకు కేజీబీవీ టీచర్ల సంఘ నేతగా చెప్పుకుంటున్న ఒకరు కారణమని జేఏసీ నాయకులు ఆరోపిస్తున్నారు. సదరు నేత ఇచ్చిన సమాచారంతోనే అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో తొలగింపు ఉత్తర్వులు ఇచ్చారన్న ప్రచారం సాగుతుంది. గత ఏడాది ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

వేర్వేరు చోట్ల రైలుకింద పడి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి

అనకాపల్లి టౌన్, జనవరి 6: అనకాపల్లికి సమీపంలోని శంకరం ఫ్లై ఓవర్ వంతెన కింద, జాతీయ రహదారిలోని వంతెన కింద జరిగిన రైలు ప్రమాదాల్లో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందినట్టు దువ్వాడ జీఆర్‌పీ ఎస్‌ఐ కె.శాంతారాం తెలిపారు. విజయవాడ-విశాఖపట్నం రైల్వే ట్రాక్‌పై శంకరం వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడిపోయి మృతి చెంది ఉండొచ్చనని ఎస్‌ఐ తెలిపారు. ఈయన వయసు 35 నుంచి 40 ఏళ్లు ఉంటాయని, తెలుపురంగు ఫుల్‌హ్యాండ్ షర్టు, గ్రే కలర్ ఫుల్ నిక్కరు ధరించి ఉన్నాడని తెలిపారు. అలాగే జాతీయ రహదారిలోని వంతెన వద్ద జరిగిన ప్రమాదంలో మృతుడు వయసు 35 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. మృతుడు లేత ఆకుపచ్చ రంగు చొక్కా, నలుపురంగు ఫుల్‌ప్యాంట్, నలుపురంగు డ్రాయర్ ధరించి ఉన్నాడని తెలిపారు. మరే ఆధారాలు లభ్యం కాలేదని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించామన్నారు. ఆచూకీ తెలిసిన వారు సెల్‌ఫోన్ నంబరు 7673906010కు సమాచారమివ్వాలని ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

బుచ్చెయ్యపేట, జనవరి 6 : అనారోగ్యంతో మండలంలోని పొట్టిదొరపాలెంలో నంబారు అప్పారావు(72) అనే వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. మధుమేహం, మతిమరుపుతో దీర్ఘకాలికంగా బాధపడుతున్న అప్పారావు శనివారం ఇంటి ఆవరణలో గల మామిడి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కుమారుడు సత్తిబాబు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికిత్స పొందుతూ మాజీ సైనికుడు మృతి

అనకాపల్లి టౌన్/కె.కోటపాడు, జనవరి 6: స్థానిక మిరియాలకాలనీ అన్నపూర్ణ బ్యాంకు వద్ద ఈనెల రెండో తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మాజీ ఆర్మీ ఉద్యోగి శనివారం ఉదయం విశాఖ ఆస్పత్రిలో మృతి చెందినట్టు ట్రాఫిక్ ఎస్‌ఐ ఎస్.సత్యనారాయణ తెలిపారు. కోటపాడు మండలం సూదివలసకు చెందిన రిటైర్డు ఆర్మీ ఉద్యోగి మొల్లి సన్నిబాబు (49) స్థానిక గుండాలవీధి జంక్షన్ వద్ద ఉంటున్నాడన్నారు. ప్రస్తుతం ఈయన స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్నాడన్నారు. ఈనెల రెండో తేదీన తన కుమారుడికి బాగోకపోతే ఆస్పత్రికి వెళ్లేందుకు నడుచుకొని వెళ్తుండగా వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయన్నారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్టు భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'సింహాద్రి' మొదటి యూనిట్‌లో ఉత్పత్తి పునరుద్ధరణ

» మహిళా ఉద్యోగులదే కీలకపాత్ర : జీజీఎం



కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగినులు

పరవాడ, జనవరి 6 : సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ) మొదటి యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు మహిళా ఉద్యోగులు కీలకపాత్ర పోషించారని సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా తెలిపారు. వార్షిక నిర్వహణ పనుల నిమిత్తం మొదటి యూనిట్‌ను గతేడాది నవంబరులో షట్‌డౌన్ చేశారు. నాటి నుంచి నిర్వహణ పనులను మహిళా ఉద్యోగుల పర్యవేక్షణలోనే చేపట్టడం జరిగిందన్నారు. శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించామని తెలిపారు. ప్రాజెక్టులో గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. శనివారం మహిళా ఉద్యోగులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి ఓఅండ్ఎం విభాగం జీఎం డీపీ పాత్ర, ఆపరేషన్ విభాగం జీఎం పీఆర్ రాజగోపాలన్, మెయింటెనెన్స్ విభాగం జీఎం కె.మ్యాథ్యు తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలిచి కార్మికులు నిరసన



మోకాళ్లపై నిలిచి సమస్యలపై నినాదాలు చేస్తున్న కార్మికులు

ఎలమంచిలి, జనవరి 6: స్థానిక మునిసిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు శనివారం నాలుగో రోజు సమ్మెలో భాగంగా మోకాళ్లపై నిల్చుని నిరసనను తెలిపారు. మునిసిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నిరసన శిబిరంలో తమ డిమాండ్లను నెరవేర్చాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా మునిసిపల్ వర్కర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కంపుకొడుతున్న పట్టణ వీధులు

పారిశుధ్య కార్మికుల సమ్మెలో ఎలమంచిలి పట్టణ వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నది. పట్టణ ప్రధాన రహదారి మినహా మిగిలిన వీధులన్నీ చెత్త చెదారంతో నిండుకుంటున్నాయి. పట్టణంలో ఇంటింట చెత్త సేకరణ నిలిచిపోవడంతో వీధుల్లో చెత్తను వేస్తుండడంతో సమస్య మరింత జటిలంగా మారుతుంది. వీధుల్లో ఏర్పాటు చేసిన చెత్త డబ్బాలు నిండిపోవడంతో రోడ్లన్నీ కంపుకొడుతున్నాయి. కొన్ని వీధుల్లో డంపర్ బిన్‌లు చెత్తతో నిండిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయి. మునిసిపాలిటీలో మొత్తం 92 మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. వీరిలో 78 మంది సిబ్బంది సమ్మెలోకి వెళ్లారు. మిగిలిన వారంతా ప్రధాన రోడ్లు, మార్కెట్ వీధుల్లో చెత్తను తొలగించే పనిలో ఉంటున్నారు. ప్రతి రోజు మునిసిపాలిటీలో 16 టన్నులు చెత్త సేకరించేవారు. ప్రస్తుతం ఉన్న సిబ్బంది రోజుకు 5 నుంచి 7 టన్నులు చెత్తను సేకరిస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	70.00
లైవ్ ధర	90.00
విత్ స్కిన్	150.00
స్కిన్ లెస్	160.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

గోకులాలాల షెడ్ల నిధుల స్వాహాపై విచారణ

» అప్పటి పశువైద్యాధికారి దుర్గాప్రసాద్‌ను విచారించిన డీఎస్పీ

» షెడ్ల కోసం దరఖాస్తులు చేసిన రైతుల వివరాలు.. తదితరాలపై ఆరా



కోటవురట్ల పోలీస్ స్టేషన్‌లో పాడిరైతులను విచారిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

మాకవరపాలెం, జనవరి 6: గోకులం షెడ్ల నిధుల స్వాహా ఆరోపణలపై డీఎస్పీ శ్రీనివాసరావు శనివారం ఇక్కడ విచారణ జరిపారు. జిల్లాలోని మాకవరపాలెం, కోటవురట్ల, రోలుగుంట, గొలుగొండ, రావికమతం తదితర మండలాల్లో గోకులాల షెడ్లు నిర్మించుకున్న రైతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా, సాయిబాలజీ ఎంటర్ ప్రైజెస్ పేరిట నిధులు జమకావడంతో ఈ వియషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. మాకవరపాలెంలో 151 షెడ్లకు గాను ప్రభుత్వం రెండున్నరేళ్ల క్రితం సాయిబాలజీ ఎంటర్ ప్రైజెస్ పేరుమీద రూ.1,55,58,158లను జమ చేసింది. ఈ విషయాన్ని అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' వివరాలతో కథనాన్ని ప్రచురించింది. దీంతో టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి గోకులాల షెడ్ల నిధులపై పూర్తి విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో పశువైద్య శాఖకు సంబంధించి గ్రామాల్లో నేరుగా రైతుల వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. అనంతరం నిధుల స్వాహాపై విచారణ చేపట్టిన అధికారులు ఇటీవల అనకాపల్లి జిల్లా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో డీఎస్పీ శ్రీనివాసరావు డిసెంబరు 25వ తేదీన మాకవరపాలెం పోలీసు స్టేషన్‌లో గోకులాల షెడ్లు నిర్మించిన రైతులను పిలిచి విచారణ జరిపారు. శనివారం అప్పటి పశువైద్యాధికారి దుర్గాప్రసాద్‌ను విచారించారు. అప్పట్లో ఈ పథకం కింద షెడ్ల నిర్మాణానికి రైతులు ఎంతమంది దరఖాస్తులు చేశారు, ఎంతమందికి బిల్లులు మంజూరు చేశారు తదితరాలపై ఆరా తీశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ గోకులాల షెడ్లు నిర్మించిన రైతులు బిల్లులు అందకపోతే స్థానిక పోలీస్ స్టేషన్‌లో నేరుగా ఫిర్యాదు చేయాల్సిందిగా సూచించారు.

కోటవురట్లలో....

కోటవురట్ల : మినీ గోకులం పథకం కింద షెడ్లు నిర్మించిన రాజుపేట పాడి రైతులను అనకాపల్లి డీఎస్పీ శ్రీనివాసరావు శనివారం కోటవురట్ల పోలీస్ స్టేషన్‌లో విచారించారు. వారి నుంచి వివరాలు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రమణయ్య, రాజుపేట సర్పంచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలి : బుద్ద

తుమ్మపాల, జనవరి 6: రాష్ట్రంలో వైసీపీ సాగిస్తున్న అరాచక పాలనకు ప్రజలు స్వస్తి పలకాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. సైకో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నుంచి రాష్ట్రాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కులాల పేరుతో జగన్‌రెడ్డి ప్రజలను విడగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో అధికారం చేపట్టాలని పలు కుట్రలు, కుతంత్రాలతో సోషల్ మీడియాలో వైసీపీ గ్రూపులను ఏర్పాటు చేసి ప్రతిపక్ష పార్టీల కుటుంబాలను టార్గెట్ చేస్తున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాల మహిళల ధన,మాన, ప్రాణాలతో వైసీపీ నాయకులు చెలగాటమాడుతున్నారన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకుని బాధితులపైనే తిరిగి అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములు అనే తేడా లేకుండా పిల్ల సైకోలు కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు రా.. కదిలి రా.. అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పర్యటిస్తున్నారని, ఈ పర్యటనలను విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

నేడు విశాఖలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల దీక్షలు

చోడవరం, జనవరి 6: విద్యుత్ శాఖలోని కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆదివారం విశాఖపట్టణంలో గల ఈపీడీసీఎల్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టనున్నట్టు యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేపాడ సత్యనారాయణ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఇక్కడి ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ఆవిష్కరించి మాట్లాడారు. ఈ ఆందోళన కార్యక్రమానికి కాంట్రాక్టు కార్మికులంతా విచ్చేసి విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు భాస్కరరావు, రీజినల్ అధ్యక్షులు ప్రేమచంద్రశేఖర్, డివిజన్ అధ్యక్షుడు నాగప్పారావు, కార్యదర్శి కలిమి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరువీధుల్లో ఆధ్యాత్మిక శోభ



తిరువీధుల్లో రాజాధిరాజ వాహనంపై స్వామి ఊరేగింపు (ఇన్‌సెట్‌లో) వెంకన్న

నక్కపల్లి, జనవరి 6: ధనుర్మాసం సందర్భంగా ఉపమాకలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ప్రతి రోజూ స్వామి వారిని అనేక వాహనాల్లో అలంకరించి మాఢవీధుల్లో ఊరేగిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం రాజాధిరాజ వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామిని, పల్లకీలో గోదాదేవి అమ్మవారిని అలంకరించి ఊరేగించారు. డీఎల్‌పురం గ్రామానికి చెందిన భజన సభ్యులు శ్రీహరి నామసంకీర్తన చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. తదుపరి గోదాదేవి అమ్మవారి సన్నిధి వద్ద తిరుప్పావై పాశుర విన్నపం చేశారు.

పాఠశాలలో పనుల నాణ్యత పరిశీలన

» నాడు-నేడు నిధుల దుర్వినియోగం ఫిర్యాదుపై ఆర్‌జేడీ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ జ్యోతికుమారి

ఎస్.రాయవరం, జనవరి 6: మండలంలోని రేవుపోలవరంలో నాడు-నేడులో భాగంగా నిర్మిస్తున్న జడ్పీ హైస్కూల్ భవనం కోసం సిద్ధం చేసిన ఇసుక, ఐరన్, పిక్క తదితర మెటీరియల్‌ను శనివారం విశాఖ రీజనల్ జనరల్ స్కూల్ ఎడ్యుకేషన్ జోన్-1 (ఆర్‌జేడీ) జ్యోతి కుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు-నేడు నిధులు దుర్వినియోగంపై విద్యా శాఖ మంత్రి బొత్సకు ఫిర్యాదు అందిందన్నారు. ఆయన ఆదేశాలతో తనిఖీ చేస్తున్నట్టు చెప్పారు. మెటీరియల్ బాగానే ఉన్నాయన్నారు. పాఠశాల నిర్మాణానికి సంబంధించి రూ.2.97 కోట్లకు గానురూ.44,65,440 మంజూరయ్యాయన్నారు. ఇందులో 19,74,890 ఖర్చు చేయగా.. మిగతా సొమ్ము హెచ్‌ఎం అక్కౌంట్‌లో ఉందన్నారు. అంతకుముందు విద్యార్థులతో ఆమె మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. ఆమె వెంట ఏఎన్ఎస్ఎన్ మూర్తి, సర్పంచ్ మల్లె లోవరాజు ఉన్నారు.

'భూముల రీ సర్వేలో అభ్యంతరాలు స్వీకరణ'

» సర్వే శాఖ ఏడీ గోపాలరాజు వెల్లడి » సబ్బవరంలో సర్వే రాళ్లు పాతే ప్రక్రియ పరిశీలన

సబ్బవరం, జనవరి 6 : మండలంలో చేపట్టిన రీ సర్వేకు సంబంధించి రైతుల అభ్యంతరాలను తీసుకుంటామని సర్వే శాఖ ఏడీ సర్వే గోపాలరాజు అన్నారు. సబ్బవరం సచివాలయం-2లో శనివారం రీసర్వేకు సబంధించిన జాబితాను రైతులకు వివరించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏడీ మాట్లాడుతూ.. సబ్బవరంలో 1,368 సర్వే రాళ్లు, ఎల్లుప్పిలో 1,110 సర్వేరాళ్లు, బోదివలసలో 920 సర్వే రాళ్లు పాతేందుకు సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే అనకపల్లిలో 988 రాళ్లు పాతడం జరిగిందన్నారు. సబ్బవరంలో మొదటి విడతగా ప్రభుత్వ భూముల్లో సర్వే రాళ్లు పాతడం ప్రారంభించామన్నారు. రెండు విడతలో జిరాయితీ భూముల్లో పాతడం జరుగుతుందన్నారు. వివాదాలకు తావులేకుండా రైతుల సమక్షంలో సర్వే రాళ్లు పాతాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దెడ్డం ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు బైలపూడి దేముడుబాబు, సర్వే ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు, తహసీల్దార్ బి.సత్యనారాయణ, డీటీలు వెంకట్, గణేష్, సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులకు డిమాండ్

» ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ జగన్నాథరావు



ప్రచురణల ఆవిష్కరణలో డాక్టర్ జగన్నాథరావు తదితరులు

కొత్తూరు, జనవరి 6: వ్యవసాయ విలువ ఆధారిత ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని ఆర్ఏఆర్ఎస్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు అన్నారు. విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై అర్ఏఆర్ఎస్‌లో శనివారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'ఆత్మ' ఆధ్వర్యంలో ఈ సమావేశానికి ప్రాజెక్టు డైరెక్టర్ ఆశాదేవి అధ్యక్షత వహించారు. మహిళా రైతులు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ద్వారా అధిక ఆదాయం పొందవచ్చనన్నారు. ఇంజనీరింగ్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి, శాస్త్రవేత్తలు రమణమూర్తి, ఆదిలక్ష్మి, ముకుందరావు శిక్షణ ఇచ్చారు. బెల్లం, చిరుధాన్యాలతో విలువ ఆధారిత వస్తువుల ఉత్పత్తిపై ప్రచురించిన రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. శిక్షణలో మూడు మండలాలకు చెందిన మహిళా రైతులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్, పక్కన నాయకులు

సైకో పాలకుడ్ని సాగనంపుదాం

- అన్ని వర్గాలూ కలిసి రాష్ట్రాన్ని కాపాడుకోవాలి
- పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి శ్రావణ్‌కుమార్

అరకులోయ, జనవరి 6: సైకో పాలకుడ్ని సాగనంపుదామని టీడీపీ అరకులోయ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఓ రిసార్ట్‌లో పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసిన శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. నాలుగున్నరేళ్ల వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలని చెప్పారు. సైకో పాలకుడి నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకు అన్ని వర్గాలూ కలిసి ముందుకు రావాలని కోరారు. సైకో పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడి అరాచకపాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు గాడి తప్పాయని ఆయన ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం రెడ్డి పాలనను సాగిస్తోందని, రెడ్డిలకు అందలం ఎక్కించి సామాన్య, మధ్య తరగతి ప్రజల కష్టాలను విస్మరించిందని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం గాలిలో కలిసిపోయాయని ఎద్దేవా చేశారు. అందుకే రాష్ట్ర ప్రజలు, గిరిజన ప్రజానీకం చంద్రబాబునాయుడు రావాలని కోరుకుంటున్నారన్నారు. తెదేపా అధికారంలో వస్తే 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1,500 కల్పిస్తోందన్నారు. దీపం పథకంతో ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు కల్పిస్తుందని చెప్పారు. అన్నదాతలకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తుందన్నారు. ఇంటింటికీ సురక్షిత తాగునీటి కల్పనే ధ్యేయంగా చంద్రబాబు మేనిఫెస్టో రూపొందించారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బాబూరావు, మాజీ వైస్ ఎంపీపీ అమ్మన్న, తెలుగుయవత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సాయిరాం, తెలుగుయువత ప్రధాన కార్యదర్శి రమేష్, టీఎన్‌టీయూసీ పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మండ్యాగురు స్వామి, యూనిట్ ఇన్‌చార్జులు కళావతి, ద్రౌపతి, అప్పలరాజు, శెట్టి రాజు, బూత్ ఇన్‌చార్జులు కామేష్, సదానందం, నగేష్, ఆనంద్, నాయకులు శెట్టి గోపాల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలి

- రా.. కదలిరా.. కార్యక్రమం విజయవంతం చేయాలి
- టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



పాడేరు రూరల్, జనవరి 6: రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా కొనసాగుతున్న వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పిలుపునిచ్చారు. శనివారం ఆమె మాట్లాడుతూ కులాల కుంపటి పెట్టి ప్రజలను విడగొట్టి మళ్లీ సీఎం కుర్చీ ఎక్కాలని జగన్ కుటిల ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఎన్ని ఎత్తులు వేసినా రాష్ట్ర ప్రజలు వచ్చే ఎన్నికల్లో జగన్‌ను చిత్తు చేయడం ఖాయమన్నారు. రా.. కదలిరా.. కార్యక్రమం విజయవంతం చేయాలని, ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేయాలని పార్టీ శ్రేణులను ఆమె కోరారు. సైకో రెడ్డి పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకొనేందుకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలన్నారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని వివరించాలన్నారు. టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గబ్బాడ సింహాచలం శనివారం ఉబ్బెడిపుట్టు గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు టీడీపీ అధికారంలోకి రాగానే అమలుచేసే పథకాలను వివరించారు.

గ్రామాల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

- టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు నారాయణరావు


కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు నారాయణరావు

చింతపల్లి, డిసెంబరు 6: గిరిజన గ్రామాల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు రాజమండ్రి నారాయణరావు అన్నారు. చౌడుపల్లి పంచాయతీలోని వామగెడ్డ కొత్తూరు గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో శనివారం బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన జగన్, గిరిజన గ్రామాలను పదేళ్ల వెనక్కి నెట్టేశారన్నారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు సమస్య అధికంగా ఉందని, విద్య, వైద్యం అంతంతమాత్రంగానే అందుతున్నదని వాపోయారు. గిరిజనులకు ప్రత్యేక పథకాలు రావాలన్నా, గ్రామాలు అభివృద్ధి చెందాలన్నా టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికైన ప్రజలు చైతన్యంతో వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి చంద్రబాబుకుఅండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, క్లస్టర్ ఇన్‌చార్జి భీమన్న, పంచాయతీ కమిటీ అధ్యక్షుడు గొల్లొరి మంగు, గిరిజనులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కష్టాలు ఇన్నన్ని కాదయా..!

- సరకులు మోసుకువెళ్లిన గర్భిణులు, బాలింతలు
- చిన్నారులతో నాలుగు కిలోమీటర్ల దూరం నడిచిన దైన్యం


కాలినడకన చిన్నారులతో సరకులను మోసుకువెళ్తున్న బాలింతలు

డుంబ్రిగుడ, జనవరి 6: మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మెతో గిరిజనులకు పౌష్టికాహార కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రధానంగా గర్భిణులు, బాలింతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఇన్నన్ని కావు. సమస్యలు పరిష్కరించాలని 26 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా, ప్రభుత్వం స్పందించకపోవడంతో కేంద్రాలు తెరచుకోవడం లేదు. ప్రత్యామ్నాయంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహార సరకుల పంపిణీ బాధ్యతలను సచివాలయ ఉద్యోగులకు అప్పగించారు. ఇందులో భాగంగా మండలంలోని కొల్లాపుట్టు పంచాయతీ బూసివలస సచివాలయ కేంద్రంలో ఆరు అంగన్‌వాడీల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు శుక్రవారం సరకులను పంపిణీ చేశారు. దీంతో ఆరు కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న బూసివలసకు కాలినడకన సాగించి సరకులను తీసుకోవాల్సిన దుస్థితి దాపురించింది. పిల్లలను చంకలో పెట్టుకుని ఇబ్బందులు పడుతూ సరకులను తీసుకుని స్వగ్రామాలకు చేరుకున్నారు. ఈ దృశ్యాలను చూసిన వారి మనసు తరించిపోయింది.

మన్యం గజగజ

... 5వ పేజీ తరువాయి


పాడేరు-జి.మాడుగుల రోడ్డులో కమ్ముకున్న పొగమంచు

మంచు దట్టంగా కురుస్తున్నది. ఉదయం పదిన్నర గంటల వరకు మంచు గిరిజన గ్రామాలను వీడడం లేదు. దీంతో వాహన చోదకులు లైట్లువేసుకున్న నెమ్మదిగా ప్రయాణిస్తున్నారు. ప్రధాన కూడళ్లలో సాయంత్రం ఐదు గంటల నుంచే జనసంచారం పెద్దగా కనిపించడం లేదు. దుకాణాలు సైతం సాధారణ రోజుల కంటే ముందుగానే మూసేస్తున్నారు. చలి వల్ల వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

గో బ్యాక్ మాధవి..

- వైసీపీ అరకు అసెంబ్లీ ఇన్‌చార్జి రాకపై నిరసన
- అసంతృప్తి వ్యక్తం చేసిన పార్టీ ఆశావాహులు



అరకు అంబేడ్కర్ కూడలిలో నినాదాలు చేస్తున్న నాయకులు

అరకులోయ, జనవరి 6: 'నాన్ లోకల్ వద్దు.. లోకలే ముద్దు. గో బ్యాక్ మాధవి' అంటూ వైసీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాకపై ఆ పార్టీ ఆశావహులు నిరసన తెలిపారు. శనివారం ఆమె అరకులోయ వచ్చిన సందర్భంగా స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద వ్యతిరేక వర్గీయులంతా ఈ కార్యక్రమం చేపట్టారు. ఎంపీ గొడ్డేటి మాధవి కాగా స్థానికేతరాలు కావడంతోనే నేరుగా అరకులోయకు వచ్చే సాహసం చేయలేకపోయారని, అరకు రైల్వే స్టేషన్ నుంచి రైలులో విశాఖపట్నం వెళ్లిపోయారని ఈ సందర్భంగా అరకు అసెంబ్లీ నుంచి వైసీపీ టిక్కెట్ ఆశిస్తున్న స్థానిక నాయకులు సమర్డి రఘునాథ్, హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, డుంబ్రిగుడ జడ్పీటీసీ సభ్యులు జానకమ్మ తదిరులు పేర్కొన్నారు. మాధవిని అరకు అసెంబ్లీ ఇన్‌చార్జి నుంచి తప్పించాలని, స్థానికులకే ఆ బాధ్యతలు అప్పగించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు హస్తినకుమార్, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎల్‌బి.కిరణ్, పార్టీ నాయకుడు పట్టాసి సంపత్, లోతేరు, భల్లుగుడ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

నేనేమీ వేరే ఖండం నుంచి రాలేదు: మాధవి


విలేకరులతో మాట్లాడుతున్న వైసీపీ అరకు ఇన్‌చార్జి, ఎంపీ మాధవి

తానేమి వేరే దేశం నుంచో, వేరే ఖండం నుంచో రాలేదని వైసీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎంపీ గొడ్డేటి మాధవి స్పష్టం చేశారు. శతశాతం అల్లూరి జిల్లా, గిరిజన ప్రాంతానికి చెందిన వ్యక్తినని పేర్కొన్నారు. అరకు రైల్వే స్టేషన్‌లో శనివారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ తన తండ్రి బతికి ఉన్నంత వరకు గిరిజనులకు సేవలు అందించారని, అటువంటి కుటుంబం నుంచి వచ్చానని చెప్పారు. సర్వేల ఆధారంగా పార్టీ అధినేత జగన్ తన సేవలను అరకు అసంబ్లీకి వినియోగించుకోవాలని ఇక్కడ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారని, పార్టీ నిర్ణయమే తనకు శిరోధార్యమని పేర్కొన్నారు. స్థానిక నాయకులు, ప్రజలు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఘాట్ రోడ్డులో ప్రయాణం ఇబ్బందికరం కావడంతో రైలులో విశాఖ వెళ్తున్నానని, మరో రెండు రోజుల్లో అరకు వచ్చి అందరినీ కలిసి మాట్లాడతానని మాధవి చెప్పారు. కాగా, అంతకు ముందు అరకు రైల్వే స్టేషన్ వద్ద స్థానిక జడ్పీటీసీ సభ్యురాలు రోష్నీ, పార్టీ నాయకులు కమిడి అశోక్, దురియా ఆనందరావు, సుస్మిత, గాసీ తదితరులు మాధవికి స్వాగతం పలికారు. మరోసారి అరకు వచ్చి అందరితో మాట్లాడతానని ఈ సందర్భంగా మాధవి వారితో చెప్పారు.



పాడేరు నిరసన శిబిరంలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు... చింతపల్లి శిబిరంలో మాట్లాడుతున్న సీఐటీయూ ఆయకుడు చిన్నయ్యపడాల్

సమ్మెపై ఎస్మా జీవో ఉపసంహరించుకోండి

- సీఐటీయూ జిల్లా నేత సుందరరావు.. నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభించిన అంగన్‌వాడీలు

పాడేరు రూరల్, జనవరి 6: అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మాను ప్రయోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో పంబరు-2ను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎల్.సుందరరావు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు సమ్మెలో భాగంగా ఐటీడీఏ ఎదురుగా నిర్వహిస్తున్న నిరసన శిబిరంలో శనివారం నిరవధిక నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 26 రోజులుగా అంగన్‌వాడీలు శాంతియుతంగా చేస్తున్న సమ్మెను ఎస్మా చట్టపరిధిలోకి తీసుకువచ్చి నిషేధించాలనుకోవడం అప్రజాస్వామికమన్నారు. సమస్యలు పరిష్కరించాల్సిన జగన్‌రెడ్డి ప్రభుత్వం, అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ సమ్మెను నిషేధిస్తూ సమ్మె కాలానికి వేతనాల్లో కోత విధించడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. ఇదే వైఖరిని కొనసాగిస్తే జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. అనంతరం అంగన్‌వాడీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ 26 రోజులుగా సమ్మెను చేపడుతున్నా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఎస్మాను ప్రయోగించినా, మరేతర భయాందోళనలకు గురిచేసినా బెదిరేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం దిగివచ్చి సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు చిన్నారి, ఛాయాదేవి, అంబిక, సత్యవతి, జయ, కుమారి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఎస్మాను ఖండిస్తున్నాం..: అప్పలనర్స

శాంతియుతంగా జరుగుతున్న అంగన్‌వాడీల సమ్మెను ఎస్మా చట్ట పరిధిలోకి తీసుకువచ్చి నిషేధించడాన్ని సీపీఐ (ఎం) తీవ్రంగా ఖండిస్తుందని జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ చర్యను కార్మిక, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజాతంత్రవాదులు ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. జీవో-2ను ఉపసంహరించుకేని సమస్యలు పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

వైసీపీ ప్రభుత్వ పతనం ఆరంభం..

చింతపల్లి: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ పతనం ప్రారంభమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగాన్ని అందరూ ఖండించాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం నెల రోజులుగా నిరసనలు, ఆందోళన చేస్తున్నప్పటికీ వైసీపీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం దారుణమన్నారు. కార్యకర్తలపై ఒత్తిడి పెంచి సమ్మెను బలవంతంగా విరమించాలని చేస్తున్న ప్రయత్నాలను ప్రతిఘటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షురాలు రాములమ్మ, ప్రధాన కార్యదర్శి పెంటమ్మ, నాయకులు సత్యవతి, నాగమ్మ, లక్ష్మి, వరలక్ష్మి, చెల్లయమ్మ, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ బెదిరింపులకు బెదరం..

- సమస్యలు పరిష్కరించే వరకూ పోరాడుతాం
- సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘ ప్రతినిధులు


సమ్మె శిబిరంలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

పాడేరు రూరల్, జనవరి 6: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగా కొంత మందిని తొలగించినట్లు ఉత్తర్వులు జారీ చేయడం, విధుల్లో చేరకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడటాన్ని పక్కన పెట్టి మా సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మెను కొనసాగిస్తూ పోరాటాన్ని సాగిస్తామని ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అనీల్‌కుమార్, జయరాజ్ స్పష్టం చేశారు. శుక్రవారం విజయవాడలో జరిగిన చర్చల్లో సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం హామీ ఇచ్చినట్టే ఇచ్చి 18 రోజులగా సమ్మెలో పాల్గొన్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల్లో భాగమైన కేజీబీవీ టీచర్‌లు, వర్కర్లకు శనివారం టెర్మినేషన్ లెటర్లు జారీ చేయడం ప్రభుత్వ మొండి వైఖరికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మానవత్వంతో ఆలోచించి ఎన్నికల సమయంలో తీను ఇచ్చిన హామీలను మాత్రమే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. మాట తప్పను, మడం తిప్పను అని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి తాను ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరే ఉద్యోగులపై ఎస్మా ప్రదర్శించడం, ఉద్యోగాలనుంచి తొలగించే ఏర్పాట్లు చేయడం విచారకమన్నారు. ఇప్పటికైనా 5వ తేదీ శుక్రవారం విజయవాడలో జరిగిన చర్చల్లో అమోదించిన హామీలను అమలు చేయాలని కేజీబీవీ ఉద్యోగులకు జారీచేసిన టెర్మినేషన్ ఉత్తర్వులను వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, ఎస్ఎస్ఏ ఉద్యోగులు పాల్గొన్నారు.

కేజీబీవీ టీచర్ల తొలగింపు

... 5వ పేజీ తరువాయి

ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో విశాఖలోని ఒక హోటల్‌లో వైసీపీ అభ్యర్థికి అనుకూలంగా సమావేశం ఏర్పాటుచేసి నేతే.. ఇప్పుడు ఉద్యమాన్ని నీరుగార్చేందుకు యత్నిస్తున్నట్టు అనకాపల్లి జిల్లాకు చెందిన పలువురు ఉద్యోగులు అనుమానిస్తున్నారు.

భూ సమస్యలకు పరిష్కారం చూపకుంటే చావే శరణ్యం

- పెదగంగవరం గ్రామస్థుల ఆవేదన

దేవరాపల్లి, జనవరి 6: పెదగంగవరంలో దీర్ఘకాలంగా తమ సాగులో ఉన్న భూములపై హక్కులు కల్పించడంలో అన్యాయం జరుగుతోందని గ్రామస్థులు వాపోయారు. 'అయితే శాశ్వత హక్కు కల్పించండి.., లేదా ఆత్మహత్యలు చేసుకోవడానికి అనుమతులు ఇప్పించండి..' అంటూ వేడుకున్నారు. శ్రీరామ రైతు సంక్షేమ సంఘం నాయకులు కేవీ రమణతో పాటు, ఆ గ్రామ పెద్దలు శనివారం విలేకరులతో మాట్లాడుతూ దేవరాపల్లి సమీపంలో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం జీనబాడు పంచాయతీ శివారు గ్రామమైన పెదగంగవరంలో 1847 నుంచి తమ తాతతండ్రుల నుంచి నివసిస్తున్నామన్నారు. ప్రస్తుతం 300 కుటుంబాల వారం నివసిస్తున్నామని, 1/70 చట్టం అడ్డం పెట్టుకొని తమకు రావలసిన సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నామని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే తమకు చావడమే చరణ్యమన్నారు. ఈ సమావేశంలో గ్రామ పెద్దలు కొటాన అక్కునాయుడు, తోట దేముడు, కొటాన రాము, మిడతాడ శ్రీను, ద్వారపురెడ్డి అప్పలనాయుడు, సింహ పాల్గొన్నారు.

ఆది నుంచీ అవమానాలే

... 5వ పేజీ తరువాయి

ఛాంబర్‌లోకి కూడా అడుగు పెట్టనివ్వలేదు. ఈ విషయమై మీడియాలో కథనాలు రావడంతో ఉలిక్కిపడిన అధికారులు తరువాత రోజు ఆమెను వీసీ చాంబర్‌కు తీసుకువెళ్లి సీటులో కూర్చోబెట్టారు. ఇలా తొలిరోజే వివక్ష ఎదుర్కొన్నందుకు ఆమె బాధపడ్డారు. ఆ తరువాత కూడా మూడు రోజుల పాటు వీసీ వాహనాన్ని ఆమెకు కేటాయించకుండా చేశారు. దీనిపై రచ్చ జరుగుతుందన్న ఉద్దేశంతో తరువాత అప్పగించారు. అయితే, కీలక నిర్ణయాలు, ఇతర అంశాలకు సంబంధించిన సమాచారాన్ని మాత్రం ఆమెకు తెలియనివ్వడం లేదు. ఈ విషయమై అనేకమార్లు సన్నిహితుల వద్ద ఇన్‌చార్జి వీసీ ఆవేదన వ్యక్తం చేశారు. తన వద్దకు ఎవరూ రావడం లేదని, ఏ విషయాలు తెలియజేయడం లేదంటూ వాపోయారు. ఇక ప్రస్తుతానికి వస్తే... ఆంధ్ర యూనివర్సిటీలో శుక్రవారం నుంచి 37వ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఫెస్టివల్ (యూనిఫెస్ట్) 2023-24 జరుగుతోంది. ఈ వేడుకల నిర్వహణకు సుమారు 40 విశ్వవిద్యాలయాలు దరఖాస్తు చేసుకోగా, ఏయూకు అవకాశం దక్కింది. ఈ ఫెస్ట్‌లో పాల్గొనేందుకు వేర్వేరు రాష్ట్రాల నుంచి 800 మంది విద్యార్థులు, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ నుంచి పరిశీలకులు హాజరయ్యారు. అంతటి కీలకమైన ఈ వేడుకలకు సంబంధించిన సమాచారం ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్‌ను తెలియజేయలేదు. ఈ ఫెస్ట్‌కు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ విజయ్‌మోహన్‌ను ఆమె పిలిపించి అడిగిన తరువాతగానీ షెడ్యూల్ ఇవ్వలేదు.

వాట్సాప్‌లో ఆహ్వానం..వీలుంటే రండి..

యూనిఫెస్ట్ వేడుకలను శుక్రవారం సాయంత్రం వర్సిటీలో అట్టహాసంగా ప్రారంభించారు. అయితే, ఈ వేడుకలకు సంబంధించిన ఆహ్వానాన్ని ఇన్‌చార్జ్ వీసీకి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ వాట్సాప్‌లో పంపారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు కార్యక్రమం ప్రారంభించాల్సి ఉండగా రిజిస్ట్రార్ మూడు గంటలకు వీసీ వద్దకు వెళ్లారు. ఆ సమయంలో ఆమె...కార్యక్రమానికి ఆహ్వానించే పద్ధతి ఇదేనా అంటూ ప్రశ్నించారు. అలాగే వర్సిటీలో ఇంత పెద్ద కార్యక్రమం జరుగుతున్నప్పుడు ప్రిన్సిపాల్స్‌తో సమావేశం ఎందుకు ఏర్పాటుచేయలేదని అడిగారు. అందుకు ఆయన...అన్నీ తాను చూసుకుంటానని, 'వీలుంటే రండి' అంటూ వెళ్లిపోయారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇన్‌చార్జ్ వీసీ వేడుకలకు దూరంగా ఉండిపోయారు.

సార్ రేపే వస్తున్నారంటూ ప్రచారం..

తన వద్దకు ఎవరూ రాకుండా, కనీసం గౌరవం ఇవ్వకపోవడం వెనుక వర్సిటీలోని కొంతమంది అధికారుల పాత్ర ఉందని ఇన్‌చార్జి వీసీ కె.సమత అభిప్రాయపడుతున్నారు. 'సార్ రేపే వస్తున్నారు...బాధ్యతలు తీసుకుంటున్నారు' అంటూ కొందరు ప్రచారం చేస్తుండడంతో అధికారులు, ప్రిన్సిపాల్స్, స్టాఫ్ చాలామంది ఇన్‌చార్జ్ వీసీ చాంబర్ వైపు వెళ్లేందుకు ఆసక్తి చూపించడం లేదు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసేందుకు కూడా చాలామంది అధికారులు ఇన్‌చార్జి వీసీ చాంబర్‌కు వెళ్లలేదు. కనీసం మహిళా అధికారులు కూడా వెళ్లకపోవడంతో ఇన్‌చార్జ్ వీసీ తీవ్ర మనస్తాపానికి గురైనట్టు తెలిసింది. తనను ఇన్‌చార్జి వీసీగా ప్రభుత్వం నియమించిందని, తానేమీ కావాలని కూర్చోలేదంటూ పలువురి వద్ద ఆమె ఆవేదన వ్యక్తం చేసినట్టు చెబుతున్నారు. వ్యక్తిగతంగా తనకు గౌరవం ఇవ్వకపోయినా పర్వాలేదని, కానీ, వీసీ సీటుకు కూడా గౌరవం ఇవ్వకుండా వ్యవహరిస్తున్న తీరు బాధిస్తోందని వాపోయినట్టు తెలిసింది.

సంక్షిప్తంగా..

క్రీడాకారులకు ఆడుదాం-ఆంధ్రా సదావకాశం: ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు, జనవరి 6: ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమం క్రీడాకారులకు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి ఓ సదావకాశమని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మండలంలో శనివారం పర్యటించిన ఆమె ముందుగా పింఛన్లు అందించారు. అనంతరం ఆడుదాం-ఆంధ్రా టీ షర్టులను ఆవిష్కరించి పంచాయతీల వారీగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి ఈ కార్యక్రమం మంచి వేదిక అన్నారు. ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, జడ్‌పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ రాజులమ్మ, ఎంపీడీవో సీతయ్యానాయుడు, తహసీల్దారు తిరుమలరావు పాల్గొన్నారు.

వైసీపీ అన్ని వర్గాలను మోసగించింది..

- జనసేన పార్టీ అరకులోయ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గంగులయ్య


కండవాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గంగులయ్య

పాడేరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాలకు చెందిన ప్రజలను మోసం చేసిందని జనసేన పార్టీ అరకులోయ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ వంపూరు గంగులయ్య అన్నారు. జనసేన నేతలు ఈశ్వరరావు, బాలకృష్ణ, బాతిబురావు ఆధ్వర్యంలో మండలంలో కక్కి గ్రామంలో అధిక సంఖ్యలో యువకులు జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో మోసం, అన్యాయానికి గురికాని వాళ్లు లేరన్నారు. ప్రధానంగా గిరిజనులకు చెందిన పథకాలను రద్దు చేయడంతో పాటు రాయితీ రుణాలు, స్వయం ఉపాధి పథకాలను మచ్చుకైనా అమలు చేయలేదన్నారు. ఈ సందర్భంగా కక్కి, ఈదులపాలెం, పెదగరువు, పొగుడుపుట్టు, కందులపాలెం, కొత్తూరు గ్రామాలకు చెందిన యువకులకు జనసేన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బాలరాజు, చిన్నారావు. సతీశ్, సురేశ్, మజ్జి, నగేశ్, నాగేశ్వరరావు, చందు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనంలోనే ఏపీజీవీ బ్యాంకును నడపాలి


ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

అరకులోయ, జనవరి 6: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ) బ్రాంచిని ప్రభుత్వ భవనంలోనే నడపాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాలదేవ్, గిరిజన సంఘం మండల కార్యదర్శి బుజ్జిబాబు, ఆదివాసీ గిరిజన నిరుద్యోగుల సంఘం కన్వీనర్ కుమిడి రమేష్ తదితరులు కోరారు. ఈ మేరకు శనివారం పాడేరులోని ఐటీడీఏ పీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం స్థానిక విలేకరులకు ప్రకటన విడుదల చేశారు. అక్రమంగా నిర్మించిన భవనంలో ప్రభుత్వ రంగ బ్యాంకును ఎలా నిర్వహిస్తారని వారు ప్రశ్నించారు. చట్టాలను ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అరకులోయలో పాల శీతలీకరణ కేంద్ర భవనం, ఐటీడీఏ దుకాణ సముదాయాలు ఖాళీగా ఉన్నాయని, వాటిలోనైనా బ్యాంకును నిర్వహించాలని వారు విన్నవించారు.

సామాజిక పింఛన్ల పంపిణీ

డుంబ్రిగుడ, జనవరి 6: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం సామాజిక పింఛన్ల కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ నూతన పింఛన్లతో పాటు వృద్ధులకు కూడా పింఛన్ సొమ్ము అందించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లను పెంపుదల చేసిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెప్పారు. వృద్ధులకు ఆసరాగా ప్రభుత్వం పింఛన్లను పెంచిందని, ఈ కార్యక్రమంలో ఎంపీపీలు ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, ఎంపీడీవో ఉషారాణి, తహసీల్దార్ నాగమ్మ, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి

ముంచంగిపుట్టు, జనవరి 6: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని సర్పంచ్ నరసింహరావు కోరారు. మండలంలోని ఏనుగురాయి పంచాయతీ కేంద్రంలో శనివారం నిర్వహించిన గ్రామసభలో పలు సమస్యలపై తీర్మానం చేశారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్‌తో పాటు సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. సచివాలయ పరిధిలో ఉత్తమ వెటర్నరీ ఉద్యోగిగా ఎంపికైన వెంకటరాజును సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మీ, సచివాలయ ఉద్యోగులు సింహాచలం, సింహాద్రి పాల్గొన్నారు.